dctelugu.com

# డిస్ట్రిక్ కాలమ్

జిల్లాల వార్తావాహిని

e-PAPER

కరీంనగర్ సపుంటి: 01 సంచిక: 28 బుధవారం16 సెప్టెంబర్ 2026

## రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

**చొప్పదండి డీసీ**

గూడ్స్ ట్రాలీ ఆటో బైకును ఢీ కొట్టిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందిన ఘటన మండలంలోని చాకుంటలో చోటుచేసుకుంది. ఎస్సై నరేష్ రెడ్డి కథనం ప్రకారం చొప్పదండికి చెందిన బైర రాజ్ కుమార్ (32) చొప్పదండి కరీంనగర్ వైపు బైక్ పై వెళ్తుండగా చాకుంట ఎక్స్ రోడ్ వద్ద కరీంనగర్ నుండి గూడ్స్ ట్రాలీ ఆటో అతివేగంతో వచ్చి బైకును ఢీకొట్టడంతో రాజ్ కుమార్ కు చాతిలో బలమైన గాయాలు కాగా, బైక్ వెనుక కూర్చున్న బైర నిఖిత కు తలకు ఎడమ కాలుకు, ఎడమచేతికి గాయాలు అవ్వగా, పిట్టల ఉషశ్రీ కి ఎడమ కాలుకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను ప్రతిమ హాస్పిటల్ కి తరలించగా రాజకుమార్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య బైర కవిత ఫిర్యాదు మేరకు ఎస్సై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లుగా తెలిపారు.

## డల్లాస్‌లో డా. పేర్యాల రవీందర్‌రావుకు ఘన స్వాగతం

**అమెరికా ప్రగతిలో భాగస్వాములవుతూనే**

**మాతృదేశ సేవకు ముందుండాలి**

**తల్లిదండ్రుల త్యాగాలను మరువొద్దు..**

**యువతతోనే రెండు దేశాల భవిష్యత్**

**డా. రవీందర్‌రావు**



**కరీంనగర్ డీసీ**

కిమ్స్ విద్యాసంస్థల చైర్మెన్ డా. పేర్యాల రవీందర్‌రావుకు అమెరికాలోని టెక్సాస్ రాష్ట్రం డల్లాస్ నగరంలో ప్రవాస భారతీయులు ఘన స్వాగతం పలికారు. భారత్ నుంచి డల్లాస్ చేరుకున్న ఆయనను టెక్సాస్‌లో కిమ్స్ పూర్వ విద్యార్థుల ఇన్‌చార్జి గుడి విష్ణువర్ధన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి రమణారెడ్డి తదితరులు సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఆత్మీయ కార్యక్రమానికి 250 మందికిపైగా ప్రవాస భారతీయులు హాజరయ్యారు. ప్రవాస భారతీయులను ఉద్దేశించి డా. పేర్యాల రవీందర్‌రావు మాట్లాడుతూ అమెరికా అభివృద్ధిలో భాగస్వాములవుతూనే మాతృదేశ అభివృద్ధికి కూడా తమ వంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు. విదేశాల్లో ఎంత ఉన్నత స్థాయికి ఎదిగినా కన్న తల్లిదండ్రులను, కన్నతల్లిలాంటి మాతృదేశాన్ని ఎప్పటికీ మరువకూడదన్నారు. . వారి కష్టాన్ని, త్యాగాన్ని గుర్తించి తల్లిదండ్రుల బాగోగులను బాధ్యతగా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కిమ్స్ పూర్వ అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు బత్తిని గంగాధర్, బీఆర్ఎస్ సభ్యులు సూర్యప్రకాశ్, వేల్పుల అజయ్, రియల్ ఎస్టేట్ రంగానికి చెందిన శ్రీకాంత్‌రెడ్డి, కొండూరి సుమన్, ఫైనాన్షియల్ అడ్వైజర్ ముప్పాల శరత్, దేశీ చౌరస్తా ఫౌండర్ శేషావతారం, పాల్గొన్నారు.

## మానేర్‌లో ముగిసిన ఎస్జీఎఫ్ కబడ్డీ క్రీడోత్సవాలు

**విజేతలకు ట్రోఫీలను ప్రదానం చేసిన చైర్మన్ అనంతరెడ్డి**

**కరీంనగర్ డీసీ**

కరీంనగర్ పద్మనగర్‌లోని మానేరు సీబీఎస్ఈ పాఠశాల ఆవరణలో జరుగుతున్న 70వ కరీంనగర్ అర్బన్ అండర్ 14, 17 బాలబాలికల కబడ్డీ చాంపియన్ షిప్ పోటీలు మంగళవారం ముగిసాయి. బాలబాలికల విభాగంలో విజేతలుగా నిలిచిన జట్లకు మానేరు విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డి ట్రోఫీలను, పతకాలను ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో శారీరక మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. ఎస్జీఎఫ్ క్రీడల్లో విద్యార్థులు అద్భుతంగా రాణించి జిల్లా పేరు నిలుపాలన్నారు. మానేరు లో వరుసగా రెండో సంవత్సరం ఎస్జీఎఫ్ కబడ్డీ పోటీలను ఘనంగా నిర్వహించినట్లు తెలిపారు. ఎస్జీఎఫ్ అర్బన్ కార్యదర్శి అంతటి శంకరయ్య మాట్లాడుతూ అండర్ 14, 17 బాలబాలికల విభాగంలో సుమారు 60 పాఠశాలల నుంచి 2500 మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. అర్బన్ పోటిల్లో రాణించిన క్రీడాకారులను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్జీఎఫ్ మాజీ కార్యదర్శి వేణుగోపాల్, పీడీ, పీఈటీలు సిలివేరి మహేందర్, లింగారావు, శ్రీధర్ రెడ్డి, నరేష్, చిరంజీవి, అజయ్, స్వామి, మహేష్, శ్రీనివాస్, పాల్గొన్నారు.




## ఘనంగా జాతీయ ఇంజనీర్స్ డే వేడుకలు

**40 మంది పంచాయతీరాజ్ ఇంజనీర్లను**

**సత్కరించిన లయన్స్ క్లబ్ ప్రతినిధులు**

**కరీంనగర్ డీసీ**

జాతీయ ఇంజనీర్స్ డే సందర్భంగా కరీంనగర్ జెడ్పీ కార్యాలయం ఎదుట ఉన్న భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహానికి లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ భగత్‌నగర్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం పంచాయతీరాజ్ శాఖకు చెందిన 40 మంది ఇంజనీర్లను మమెంటోలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ?ఈ సందర్భంగా భూమేశ్వర్ మాట్లాడుతూ.. దేశాభివృద్ధికి జీవితాన్ని అంకితం చేసిన విశ్వేశ్వరయ్య క్రమశిక్షణ, నిజాయితీ, సమయపాలనకు ప్రతీక అన్నారు. నీటిపారుదల, ఆనకట్టలు, పారిశ్రామిక రంగాల్లో ఆయన సేవలు ఎంతో కీలకమన్నారు. ?ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కార్యదర్శి వాసాల రామచంద్రం, కోశాధికారి తన్నీరు వెంకటేశ్వరావు, ఉపాధ్యక్షుడు భీమనాథిని బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



